క్లుప్తంగా

అంబలి కేంద్రం ప్రారంభం

నర్వ: బోలుబండ కుటుంబ సభ్యులు ప్రతి ఏటా వేసవి దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేస్తున్న అంబలి కేంద్రంతో తమ ఉధారతను చాటుకున్నారని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం పాథర్చేడ్‌లో ఏర్పాటుచేసిన అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం బాటసారులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు అంబలి గ్లాసులను అందించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు అంబలి కేంద్రంతో దాహార్తిని తీర్చడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను బోలుబండ కుటుంబసభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, మండల నాయకులు కృష్ణారెడ్డి, నీరజ్, శరణప్ప, శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, లంకాల్ మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బద్రీనాథ్



కోస్గి: బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన బద్రీనాథ్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో బద్రీనాథ్‌ను ఎంపిక చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు బద్రీనాథ్‌ను పార్టీ కండువా వేసి అభినందించారు. ఏబీవీపీలో మండలస్థాయి మొదలు రాష్ట్రస్థాయి వరకు పలు బాధ్యతలు నిర్వహించిన బద్రీనాథ్‌ను బీజేవైఎం ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై పార్టీ నాయకులు, ఏబీవీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్, నాయకులు కన్నారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మాగనూర్: బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటన మండల కేంద్రంలోని శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. స్థానిక బాలుర వసతిగృహంలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న మాగనూర్‌కు చెందిన మహదేవ్ రోజు మాదిరిగానే వసతిగృహ విద్యార్థులకు సరకుల కోసం గ్రామానికి రాగా తిరిగి వసతి గృహానికి వెళ్తున్న క్రమంలో పోలీస్‌స్టేషన్ సమీపంలోని రాయచూర్‌వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీబస్సు ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలైయ్యాయి. యువకుడిని మెరుగైన చికిత్సకోసం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై మహదేవ్ భార్యశివలింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అబ్దుల్ ఖాదర్ తెలిపారు.

వైభవంగా గణ గౌర్ పూజలు



నారాయణపేట రూరల్: పట్టణంలోని మహేశ్వర సమాజ్ ఆధ్వర్యంలో మహిళలు గతనెల రోజులుగా గణ గౌర్ పూజలను వైభవంగా నిర్వహిస్తున్నారు. స్థానిక సరాఫ్‌బజార్‌లోని శ్రీ పాండురంగస్వామి ఆలయంలో గౌరీమాత ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు, మహామంగళహారతి చేసి భజనలు చేశారు. అంతకుముందు ఉత్సవ విగ్రహాన్ని శోబాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. భక్తులు ప్రేమలత, పుష్పలత, కాంత, రేణుక, సునీత, రచన, శశి, హేమ, బన్సీలాల్, శ్రీనివాస్, ఆనంద్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే



మరికల్: మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి హాజరయ్యారు. అలాగే ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి పాల్గొని వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న, సూర్యమోహన్, కృష్ణయ్య, హరీష్, రామకృష్ణ, ఆంజనేయులు, శేఖర్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ధర్నాను జయప్రదం చేయాలి

మరికల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం కావడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నారాయణపేటలో శనివారం నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు.



మాగనూర్‌లో



కోస్గిలో నివాళులర్పిస్తున్న నాయకులు



పేట ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి

జగ్జీవన్‌రాం ఆదర్శప్రాయుడు



మక్తల్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: పట్టణంలోని కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ యువజనసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బాబుజగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ మేరకు.. పలువురు వక్తలు మాట్లాడారు.. ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు.. అలాగే ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నివాసంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ మేరకు.. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశానికి ఉప ప్రధానిగా, ఎన్నో వినూత్న ఆలోచనలతో అభివృద్ధి పథానికి ప్రణాళికలు ఇవ్వడమే కాకుండా బహుజనుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషిచేసిన మహానీయుడని ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్‌కుమార్, రవికుమార్, కావలి తాయప్ప, కట్టసురేష్, ఆంజనేయులు, మూర్తి, నారాయణ, రాములు, రమేష్ పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : పట్టణం, మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు బాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక వీరసవార్కార్‌చౌరస్తాలో విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో, మున్సిపాలిటీ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు ఆదర్శ కళాశాలలో పీఆర్‌టీయూ సంఘం, ఎమ్మార్సీలో తపస్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా కొల్లంపల్లిలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బాబు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, వీహెచ్‌పీ నాయకులు ప్రవీణ్, మీలగిరికాంబ్లే, రఘువీర్‌యాదవ్, వెంకటేష్, ఆకాష్, విజయ్, భరత్, మహేష్, రవి నగేష్, తిరుమలయ్య, కతలప్ప, రాము, సాయిరెడ్డి, కొండారెడ్డి, సంజీవ్‌రెడ్డి, శంకర్, బాలయ్య, సంగీత, శ్రీలత, విజయ, అమల, రేవతి పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని వివేకానంద చౌరస్తాలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు.. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నర్సింగప్ప, భీంరాజు, దుర్గం శ్రీనివాస్, హజమ్మ, కొండన్‌గోపాల్, దశరత్ పాల్గొన్నారు.

మాగనూర్: బాబు జగ్జీవన్‌రాం ఆశయాలను కొనసాగించాలని ఉప తసీల్దార్ సురేష్ కోరారు. శుక్రవారం ఆయన జయంతిని పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల వారికోసం, వారి అభ్యున్నతికి ఎన్నో చట్టాలలో సంస్కరణలు తీసుకొచ్చిన గొప్పనేత అని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్వ: సమ సమాజ స్థాపనకు ఎంతో కృషిచేసిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రాంంంం అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్‌రాం అందరికీ ఆదర్శనీయుడన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గుడిసె వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, వివిధ పార్టీల నాయకులు డా.శంకర్, ఆంజనేయులు, రాములు, నర్సింహులు, చెన్నప్ప, బాల్‌రాజు, రామంజనేయులు పాల్గొన్నారు.

ధన్వాడ: సమ సమాజ స్థాపనకు ఎంతో కృషిచేసిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రాంంంం అని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ గండి బాల్‌రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని టీఎమ్మార్పీఎస్ దళిత సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటయ్య, చింతన్‌పువ్వు నర్సింహులు, రాజు, కిష్టయ్య, వెంకటయ్య, పూజారి నర్సింహులు, తిమ్మయ్య, బాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కోస్గిలో..

కోస్గి: బాబు జగ్జీవన్‌రాం బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం ఆయన జయంతిని పురస్కరించుకొని సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాజీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. దళితుల రాజ్యాధికార పితామహుడిగా పేర్కొంటూ దేశానికి జగ్జీవన్‌రాం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మ్యాకల రాజేష్, తుడుం శ్రీనివాస్, నాగులపల్లి చంద్రశేఖర్, కుమ్మరి అంజిలయ్య, అంబదాస్, అంజద్‌ఖాన్, కౌన్సిలర్ శ్రీనివాస్‌తోపాటు పలు దళిత సంఘాల నాయకులు కన్నప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.



నర్వలో..



ధన్వాడలో..



కొల్లంపల్లిలో

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తాం



చేగుంటలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జానయ్య

కృష్ణా: మండలంలోని అన్ని గ్రామాల్లో మొదట తాగునీటికి ఇబ్బందులు రానివ్వకుండా చూస్తామని ఎంపీడీఓ జానయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గుర్జాల్, గుడెబల్లూర్, చేగుంట గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు కొనసాగుతున్న ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. అలాగే ఆయా గ్రామాల్లోని తాగునీటి బోర్లు మరమ్మలతోపాటు పైప్‌లైన్ల లీకేజీలు సరిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శారధనాగప్ప, మాజీ సర్పంచ్ దేవేంద్రప్ప, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కిరణ్‌కు ఘన నివాళి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కిరణ్ ఆశయాల సాధనకు కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సి.వెంకటేశ్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో అతడి కిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఏప్రిల్ 5 వరకు సంతాప సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. రైస్‌మిల్ సంఘం నాయకులు బుజ్జి, రాములు, వెంకటయ్య, అంజనేయులు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి అరుణను గెలిపించాలి



మక్తల్: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బూత్ స్థాయి కార్యకర్తల నుంచి నాయకుల వరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే భరత్‌సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సత్యవార్, అనుగొండ, గడ్డంపల్లి, ముస్టిపల్లి, పారేవుల, ముస్లాయిపల్లి, పంచదేవ్‌పాడు, పస్పుల గ్రామాల్లో ఆయన పర్యటించారు. రాబోయే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి డీకే అరుణను భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు శేఖర్ రెడ్డి, నాగేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

యాసంగి కోతలు షురూ

- ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం
- స్థానికంగా ధరలపై రైతుల అయోమయం
- కర్ణాటకలో క్వింటాల్ ధర రూ.2,500పైనే..



మరికల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



మరికల్‌లో ప్రారంభమైన యాసంగి కోతలు

మరికల్: యాసంగి వరి ధాన్యం కొనుగోలు చేయడం కోసం అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. రైతుల నుంచి పెద్ద ఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉండటంతో ఉన్నతాధికారులు పర్యవేక్షణలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో అక్కడక్కడ వరి కోతలు ప్రారంభం కావడంతో మండలాల వారీగా పౌర సరఫరాల శాఖ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. పూర్తి స్థాయిలో ధాన్యం వచ్చేందుకు మరో 15రోజుల సమయం ఉంది. జిల్లాలో 1.15 ఎకరాల్లో వరిసాగు చేయగా దాదాపు 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 108 కేంద్రాలు ఉండగా 15 కేంద్రాలను ప్రారంభించారు.

కర్ణాటక మిల్లర్లు కన్ను..

పక్కన ఉన్నా కర్ణాటకలో యాసంగి సాగుకింద పంట విరామం ఇచ్చారు. అక్కడ ధాన్యం వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆ రాష్ట్ర మిల్లర్లు ఉమ్మడి పాలమూరు జిల్లా బాట పట్టారు. అక్కడ పెద్ద ఎత్తున మిల్లులుండటంతో అక్కడి మిల్లర్లు మన జిల్లా యాసంగి ధాన్యంపై వారి కన్ను పడింది. తెలంగాణ ప్రభుత్వం అందించే గ్రేడ్- ఏ ధాన్యం క్వింటాల్‌కు ధర రూ. 2,203, సాధారణ రకం ధాన్యానికి రూ. 2,183 కంటే అధికంగా ఇస్తామని కర్ణాటక మిల్లర్లు రైతులకు గాలం వేస్తున్నారు. క్వింటాల్‌కు రూ. 2,500 వరకు ఇస్తామని మిల్లర్లు చెబుతుండటంతో అన్నదాతలు సందిగ్ధంలో పడ్డారు. ఇక్కడి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలా..? లేక ఎక్కువ ధరకు కర్ణాటక మిల్లర్లకు అమ్మాలా..? అని ఆలోచనలో ఉన్నారు. జిల్లాల్లోని అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు వద్ద ధాన్యం తరలింపుపై గట్టి నిఘా పెట్టాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకుగాను సరిహద్దుల వద్ద పర్యవేక్షణను కట్టుదిట్టం చేశారు. రైతులకు ఇబ్బందులు కల్గకుండా కేంద్రాల వద్ద తాగునీటితోపాటు ఇతర సౌకర్యాలు ఏర్పాటుచేస్తున్నారు.

ఏర్పాట్లపై దృష్టి..

ఈ ఏడాది యాసంగికి సంబంధించిన సీఎంఆర్ త్వరగా ఇచ్చేలా అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. చాలామంది సీఎంఆర్‌ను నల్లబజారుకు తరలించడంతో మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేవు. రైతుల నుంచి ధాన్యాన్ని మిల్లర్లే నేరుగా కొనుగోలు చేసుకునేలా చక్రం తిప్పుతున్నారు. ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వాల్సి రావడంతో మిల్లర్లకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. కోతలు పూర్తిస్థాయిల్లో ప్రారంభం కాకముందే మిల్లుల్లోని సీఎంఆర్‌పై అధికారులు వివరాలు సేకరించి పెట్టుకోవాల్సిన అవసరం ఉంది.

అవసరమైన చోట..

జిల్లాలో అవసరమైన చోట తప్పకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తాం. ఇప్పటికే 15కి పైగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. మిల్లుల్లోని సీఎంఆర్ ధాన్యంపై దృష్టిసారిస్తాం. అలాగే కర్ణాటకకు ధాన్యం తరలించకుండా చర్యలు తీసుకుంటాం.

- దేవదాస్, పౌర సరఫరాల శాఖ మేనేజర్

ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



శేర్నపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న బలరాం



మద్దూర్‌లో కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట రూరల్: ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని శేర్నపల్లి, సింగారం, అప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనుల వద్దకు శుక్రవారం వెళ్లి కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీరు, టెంటు, ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజువారి కూలీ రూ.600లకు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాల చెల్లింపు డిమాండ్‌తో ఈ నెల 6న నిర్వహిస్తున్న కలెక్టరేట్ ధర్నాకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు.

మద్దూర్: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600కూలీ చెల్లించడంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని భీంపూర్‌లో ఉపాధి పనులు కొనసాగుతున్ని ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. ప్రతి కూలీకి 200రోజుల పని దినాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో కనీస వసతులు లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. 6న కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించే కార్యక్రమంలో పా ల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు హన్మంతు, కేవీపీఎస్ నా యకులు కేశవులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సీవీ రామన్ అవార్డు పొందిన పేట విద్యార్థిని



అవార్డు అందుకుంటున్న గాయత్రి

నారాయణపేట రూరల్: సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన సీవీ రామన్ టాలెంట్‌టెస్ట్‌లో నారాయణపేటకు చెందిన విద్యార్థిని ఉమ్మడి జిల్లాలో టాపర్‌గా నిలిచింది. స్థానిక శ్రీసాయి స్కూల్‌కు చెందిన గాయత్రికి శుక్రవారం హైదరాబాద్‌లో ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ చేతుల మీదుగా అవార్డును అందించారు. ఈ మేరకు పాఠశాల నిర్వాహకులు శేషమ్మ, మురళీధర్, సాయిలీల, బాలప్ప, నర్సింహ విద్యార్థినీని అభినందించారు.

'మాదిగలపై చిన్నచూపు తగదు'



పేటలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నారాయణపేట రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో ఒక్కటి కూడా మాదిగ కులస్తులకు టికెట్ ఇవ్వకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణపేటలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రెప్ప మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాదిగ జాతికి ద్రోహం చేసిందని, రేవంత్‌రెడ్డి, ఖర్గేలకు వ్యతిరేకంగా ఎన్నికల్లో పనిచేస్తామన్నారు. రాష్ట్రంలో మూడు స్థానాలు ఎస్సీలకు రిజర్వు చేసి ఉన్నా అక్కడ కూడా అత్యధిక జనాభా ఉన్న మాదిగ కులస్తులకు కేటాయించలేదని వాపోయారు. కార్యక్రమంలో ఆనంద్, అశోక్, ప్రవీణ్, వెంకటేష్, భీంషప్ప, శ్రీను, నగేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: రాష్ట్రంలో మూడు పార్లమెంట్ ఎస్సీ రిజర్వేషన్ స్థానాలు ఉండగా కాంగ్రెస్ పార్టీ మాదిగలకు సీట్లు ఇవ్వకుండా అన్యాయం చేశారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్, మండల అధ్యక్షుడు దండు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కృష్ణ అన్నారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్‌చౌక్‌లో నిరసన చేపట్టారు. నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, వరంగల్ రిజర్వ్ స్థానాల్లో మాలలకే సీట్లు కేటాయించడంపై మండిపడ్డారు. దళితుల్లో 20 శాతం కూడా లేని మాలలకు రెండు సీట్లు, ఊరికి ఒక్కరు కూడా లేని బైండ్ల కులానికి ఒక్క సీటు కేటాయించి జనాభాలో అత్యధిక శాతం ఉన్న మాదిగలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. వెంటనే సీట్ల మార్పు చేయాలని, లేని పక్షంలో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సోంబాబు, రామకృష్ణ, మాసన్న, జానకీరాం తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు

అమరచింత: మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన వంశీచంద్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలలని కోరుతూ శుక్రవారం అమరచింత జామీయా మసీదు వద్ద కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మక్తల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ తౌఫిక్ మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలంటే కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో అధికారం ఇవ్వాలని కోరారు. గరీబీ హటావో అన్న నినాదంతో ఇందిరమ్మ రాజ్య స్థాపన కోసం రాహుల్ గాంధీ చేస్తున్న ఆందోళనకు యావత్ దేశ ప్రజలు ఓటు ద్వారా మద్దతు ఇచ్చి సుపరిపాలనకు అవకాశం కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అల్తాఫ్, అస్సూ, బషీర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చిన్నారులకు అన్నప్రాసన



అన్నప్రాసనకు హాజరైన చిన్నారులు, తల్లులు

అమరచింత: పట్టణంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ పరిధిలోని ఆరు నెలల వయస్సు కలిగిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి రప్పించి వారికి అన్నప్రాసన చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ టీచర్ రాధిక మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ అంగన్‌వాడీ పరిధిలో ఆరు నెలల వయస్సు కలిగిన చిన్నారులకు బాలామృతం అందించామన్నారు. బాలమృతాన్ని చిన్నారులకు రోజువారీగా ఎలా అందించాలన్న విషయాలను తల్లులకు వివరించారు. పౌష్టికత్వంతో ఉన్న బాలమృతం చిన్నారుల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థన



దివ్యఖురాన్ లో పొందుపర్చిన సూక్తులను వివరిస్తున్న మౌలానా

అమరచింత: రంజాన్ మాసం చివరి శుక్రవారం కావడంతో పట్టణంలోని జామీయా మసీదులు ముస్లింలతో కిక్కిరిసిపోయాయి. పవిత్ర రంజాన్ నెలలో ఉపవాస దీక్ష చేపడుతున్న వారితో పాటు వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలు పవిత్ర నమాజు చేసేందుకు మసీదులకు తరలివచ్చారు. ఈమేరకు మౌలానా ఆల్తాఫ్ బేగ్ మహ్మద్ ప్రవక్త బోధనలతో పాటు దివ్యఖురాన్‌లో లిఖించబడిన అల్లా సూక్తులను చదివి వినిపించారు. ప్రతి ఒక్కరూ అల్లాపై భక్తి భావంతో ఉండాలన్నారు. నిరుపేదల పట్ల ప్రేమ, కరుణను చూపాలని కోరారు. నిత్య సంపాదనలో ఏడాదిలో పదో వంతును దైవ కార్యక్రమాలతో పాటు పేదలకు సహకారం అందించేందుకు ఖర్చు చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిరోజు ఐదు పూటల నమాజులో పాల్గొనాలని సూచించారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, సభ్యులు ఖాజాహుస్సేన్, అన్సారి, ఖాసీం మసీదులో సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక..



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నర్వ: మండలంలోని పాథర్చేడ్‌లో వివిధ పార్టీల నుంచి సీనియర్ నాయకులు కాంగ్రెస్‌లో శుక్రవారం చేరారు. ఈ మేరకు.. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన సీనియర్ నాయకులు పట్నం వెంకటప్ప, నకక వెంకటయ్య, వెంకటప్పలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్శితులమై పార్టీలో చేరుతున్నామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేసి తీరుతుందని ఎమ్మెల్యే అన్నారు. మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, కృష్ణారెడ్డి, నీరజ్, మహేష్, బోలుబండ వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.